


గుళ్లో సాయంకాలపు గంటలు గణ గణ మోగుతున్నాయి. జనం కిటకిట లాడు తున్నారు. వచ్చిన వారిలో ముప్పాతిక స్త్రీలు: రెండు వంతులు కోమట్లు.

అది పంచములను దేవాలయాల్లో ప్రవేశ పెట్టాలనే పట్టుదల రోజులు. కొంతమంది కర్రలతో గుడి మండపము మీద కూర్చున్నారు. వారికి దేవుడితో సంబంధం లేదు గాని—ఆగుడి ధర్మకర్తల డబ్బుతో కొంచెం అవుసర ముంది. వారు చేయ్యాలిసిందేమిటంటే కాంగ్రెసు అని పెద్ద పేరు పెట్టుకున్న అల్లరి పిల్లకాయలను కొంచెం భయ పెట్టటమే.

నరసింహం గుడి ముఖద్వారం దగ్గరకి వచ్చాడు. అక్కడ చేరి గడప దాటటమా మానటమా అనే వితర్కంలో పడ్డాడని చెప్పటం సమంజసంగా లేదు. కాని గడప దాటక ముందు వున్న వుత్సాహం గడప దాటిన తర్వాత లేదని చెప్పవచ్చు.

గడప దాటకముందు నరసింహం మనస్సులో వ్యాపించి వుందీ, చెవుల్లో గింగురు మంటూంది, పొద్దున లక్ష్మీకాంతమ్మ అన్న రెండు ముక్కలు—"ఇప్పుడు వదలండి.—సాయంత్రం గుళ్లో..."

ఏదో పని వున్నట్టుగా పక్కయింటికి వెళ్లి వాళ్ల కోడలు లక్ష్మీకాంతంన్ని అఘాట్టుగా చెయిపట్టు కూంటే, ఆమె యీ రెండు ముక్కలూ అని అప్పటికి తప్పించుకుంది. అంటే నరసింహం ఆమెను అందుకని వదలి పెట్ట లేదు కాని, ఆమె అత్తగారు అప్పుడే అట్లా వస్తూన్నట్లుండటం చేత చిక్కిన చేతిని వదలి పెట్టక తప్పింది కాదు. సాయంత్రం గుళ్లోకి పోకతప్పింది కాదు.

నరసింహానికి గుళ్లో ప్రవేశించిన తర్వాత వుత్సాహం తగ్గటానికి చాలా కారణాలు వున్నాయి.

ముఖ్యంగా గుళ్లో కాలు పెట్టట మంటే నరసింహానికి పెద్ద అసహ్యం. బుద్ధి తెలిసిన తర్వాత ఒకటి రెండు

పర్యాయము లేమయినా వచ్చాడేమో. తన మోస్తర వాడు గుళ్లోకి వెళ్లటం సాగించాడంటే యెవరి కోసరమో వెళ్లుతున్నాడని అందరు అనుకుంటారనీ, అసలు దేవాలయ మంటే మర్యాదస్తు లెవరూ వెళ్ల తగ్గది కాదనీ నరసింహం అభిప్రాయం. కాంగ్రెసువారు హరిజనుల్ని దేవాలయ ప్రవేశం చేయిస్తే, చెడగొట్టేది దేవాలయాల్ని కాదు హరిజనుల్నే. నరసింహం వుద్దేశ్యంలో దేవాలయాలు అంటరాని వారి కంటె అంటరానివి. కాంగ్రెసు వారి వుద్యమం వట్టి వున్మాదంగా కనపడ్డది.

## ౨

"హరోం హర హర శంభో!...హరోం హర హర!" యీ గొంద్రును ధ్వజస్తంభం దగ్గర నిల్చునిలక్ష్మీకాంతం కోసరం చూస్తున్న నరసింహం విని దద్దిరిల్లాడు. వెనక్కు తిరిగి చూస్తే ఒక పిల్ల యేనుగంత మనిషి నిల్చున్నాడు. ఆయన కోమటి; వడ్డీలు వడ్డీలు కట్టి చాలా డబ్బు గణించాడు; నిత్యం దేవాలయానికి వస్తాడు పుణ్యం సులభంగా సంపాదించటానికి. "హర హర!" అంటూంటే ఆ పెద్దమనిషి పొట్టి, ఉత్తరీయం కాసెగా చుట్టబడ్డప్పటి కిన్నీ భక్తి తన్మయత్వంలో చలించి పోతూంది.

నరసింహం నవ్వు ఆపుకోలేక పోయినాడు. ఆ షాహుకారుకు కోపం వచ్చింది. నరసింహం మొఖం చూస్తే దేముడు కోసం వచ్చినట్లులేదు. "లేవయ్యా! ఇక్కడ వచ్చే పొయ్యే వాళ్లకు అడ్డంగా నిల్చున్నావు!" అని నరసింహం మీద తనకున్న కోపమంతా కనపడే గొంతుతో అరిచాడు.

ఇహ అక్కడ వుంటే బాగుండదని నరసింహం గుళ్లో ప్రవేశించాడు. మొదట అంతా కటిక చీకటిగా వుంది. కొంత సేపటికి కళ్లు చీకటికి అలవాటు పడ్డ తర్వాత మనుష్యుల ఆకారాలు కనపడ్డయి. గుళ్లో జనం యెక్కువగానే వుంది. మనుష్యులను యెవరినీ గుర్తు పట్టటానికి వీలు లేకుండా వుంది.

వారిలో లక్ష్మీకాంతం వుందేమోనని ఆ చీకటిలో చూడ గలిగి నంత మటుకు అందరినీ తేరిపార చూశాడు. అందులో ఒక ఆకారాన్ని చూసి ఆమె తన లక్ష్మీకాంతం అని నిశ్చయం చేసుకున్నాడు. ఆమెను సమీపించాడు.

ఆమె అలంకరింప బడిన ఆ శివలింగం వంక అదే పనిగా చూస్తూంది. నరసింహం ఆమె వెనక చేరినప్పటి కిన్నీ ఆమె వెనక్కు తిరిగి చూడలేదు. నరసింహం ఒక చేతితో ఆమె చేతిని పట్టుకుని రెండవ చెయ్యి ఆమె భుజం మీద వేశాడు.

ఆమె ఇంకా దేవుడి వంకనే చూస్తూంది. కోపం వచ్చినట్లు గాని భయపడినట్లుగాని యేమీ కనపడలేదు.



(అప్పుడు "Horrid" అని......పరుగెత్తాడు)

దేవుడు, దర్శనాన్ని కోరే ప్రతివాళ్లూ యిట్లాటి వన్నీ భరింప వలసిన బాధలు(**Necessary evils**) గా భావించు కున్నట్లు కనపడ్డది నరసింహం యేమి చేసినా కుదుర్కోమన లేదు.

ఇంతలోనే పూజారి లింగానికి హారతిచ్చి గంట వాయించి, అందరూ కళ్ల నద్దుకోటానికని హారతి పళ్లెము ముందుకు తీసు కొచ్చాడు. అందరి మొఖాలు ఒక్కసారి తళ తళ మెరిసినయి.

యీ మెరుపులో నరసింహం ఆమె ముఖం గూడా చూశాడు. వెంటనే నరసింహం హృదయం కొంచెంసేపు ఆగి పోయి నట్లుంది. ఆమె వాళ్ల యింటి దగ్గరగా వుండే కోమటి నరసమ్మ పిన్ని. ఆమె 50 యేండ్లలోపు మనిషి. ఆమె తన్ను చూచిందా కొంప మునిగి పోతుంది. తనకే అసహ్యంగా వుంది. అప్పుడు "Horrid!" అని పెద్దగా మనస్సులో ఒక్క కేకవేసి వెనక వాడు వెనకనే జారి, గుడిదాటిన తర్వాత గూడా కొంతదూరం వరుగెత్తాడు.

———:O:———

ఒక సుప్రసిద్ధమైన కంపెనీ మీ కందుబాటులో వుంది



ఈ సులోచనాల షాపు, అనుభవజ్ఞులైన వారితో, వినుకు తగినవానిని సమకూర్చుడాని కన్నివిధాలా తగివున్నది.

అమితమైన చౌక ధరలకు ఆకర్షవంతమైన, అందమైన ఫ్రేములున్నాయి.

చలవ అద్దాలు అన్ని రకాలవి దొరకును.

కాల పరిమితి తప్పకుండుట, సరియైన వర్తన, ఆదరణ యెల్లప్పుడును ఇందు కూడియుండును.

కె. రత్నా అండ్ కంపెని,

మ్యానుఫ్యాక్చరింగు ఆప్టిషియన్స్, 305, ఎస్ప్లనేడ్, మద్రాసు.

ప్రశస్తమయిన లేసువేసిన ధోవతులు, మధుర ఉత్తరీయములం

కేశవరాం అండ్ కంపెని

**1/287,** ఎస్ప్లనేడ్ రోడ్డు, మదరాసు

మంచి సరకు                                                                 వెల సరసము